నేడు డయల్ యువర్ కమిషనర్, స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శిథిల స్థితిలో పోలీస్ క్వార్టర్స్

- పోలీసు శాఖకు భారంగా హెచ్ఆర్ఎ
- ఏటా రూ.21.6 లక్షల వ్యయం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో శిథిలమైన సిబ్బంది క్వార్టర్స్ కారణంగా పోలీసు శాఖపై ఏటా సుమారు రూ.21.60 లక్షల వ్యయ భారం పడుతోంది. పోలీస్ స్టేషన్ వెనకనగల క్వార్టర్స్‌లో పోలీసు సిబ్బంది నివసించాల్సి ఉండగా వారు బయట అద్దె గృహాల్లో నివసిస్తుండడంతో హెచ్ఆర్ఎ పేరుతో ఈ వ్యయం అదనంగా పోలీసు శాఖపై పడుతోంది. 15 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో రూ.లక్షలు ఏటా అదనంగా భారాన్ని పోలీస్ శాఖ భరించాల్సి వస్తోంది.

సామర్లకోట పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఉభయ తూర్పు గోదావరి జిల్లాల్లోనే ముఖ్యమైన స్టేషన్‌గా పూర్వం నుంచి గుర్తింపు పొందింది. ఈ స్టేషన్లో అన్ని షిఫ్టులూ కలిపి 30 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తూన్నారు. వీరికి సంబంధించి పోలీస్ స్టేషన్ ఆనుకుని పోలీస్ శాఖకు చెందిన సొంత స్థలంలో పూర్వమే క్వార్టర్స్ నిర్మించారు. సిబ్బంది అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండే విధంగా ఈ క్వార్టర్స్‌ను ఏర్పాటు చేసి సిబ్బంది అంతా ఒకే ప్రాంగణంలో నివసించే విధంగా అప్పట్లో ఉన్నతాధికారులు ఈ క్వార్టర్స్ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఆ గహాలన్నీ పూర్తిగా శిథిలమై వథాగా పడి ఉన్నాయి. చూసేందుకు అడవిని తలపించే విధంగా పొదలు, చెట్లు విపరీతంగా పెరిగి విష సర్పాలకు నిలయాలుగా మారాయి. సుమారు 5 ఎకరాలకు పైబడి ఉన్నాయి ప్రదేశంలో సిబ్బంది క్వార్టర్లతో పాటు వారి పిల్లలకు క్రీడ స్థలాన్ని, పార్కులు ఏర్పాటు చేసుకునే వీలుంది. దానికి మించి ఈ స్థలానికి ప్రస్తుత మార్కెట్ రేటు బట్టి చూస్తే ఎంతో విలువైన స్థలాలుగా ఈ స్థలం కనిపిస్తుంది. చుట్టూ ప్రహరీ ఏర్పాటు ఉన్నందున ఈ స్థలం ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా పదిలంగానే ఉంది. ఎక్కడైనా ప్రహరీ కూలే పరిస్థితి ఉంటే దాని ద్వారా స్టేషన్ ఆవరణలో స్థలాలు ఆక్రమణలకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ప్రస్తుతం 'హెచ్ఆర్ఎ' కింద సిబ్బంది క్యాడర్‌ను బట్టి రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు పోలీస్ శాఖ హెచ్ఆర్ఎ చెల్లింపులు చేస్తోంది. దీనితో సిబ్బంది అంతా సామర్లకోట లోనే కాక కాకినాడ పరిసర ప్రాంతాల్లో వారికి నచ్చిన అద్దె ఇంటిలో కాపురం ఉంటూ అక్కడ నుంచి వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే 30 మంది సిబ్బంది అద్దె చెల్లింపులు సరాసరిన లెక్కగడితే ఏడాదికి రూ.21.60 లక్షల వరకై అవుతోంది. ఇలా గత 15 సంవత్సరాల ఖర్చు చూసుకుంటే రూ.3.24 కోట్ల మేర పోలీస్ శాఖ సిబ్బంది అద్దె గృహాల భారాన్ని భరించాల్సి వస్తుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లోశని ఉన్నదన్న చందంగా అవసరమైన స్థలం ఉండికూడా శిథిలమైన క్వార్టర్స్ స్థానంలో కొత్తగా క్వార్టర్స్ నిర్మాణం జరగక పోవడంతో ఈ విలువైన స్థలాలు వథాగా మారాయి. పైగా స్టేషన్ సిబ్బంది విష సర్పాల భయంతో ప్రతిరోజు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. గత టిడిపి ప్రభుత్వంలో అప్పటి హోమ్ శాఖ మంత్రి చినరాజప్ప ఆధ్వర్యంలో నూతన క్వార్టర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ ప్రతిపాదనలు పరిస్థితి ప్రస్తుతం అగమ్య గోచరంగా ఉంది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు సామర్లకోట స్టేషన్ ఆవరణలో శిథిలమైన క్వార్టర్స్ స్థానంలో కొత్త క్వార్టర్స్ నిర్మించి పూర్వ వైభవాన్ని తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన పోలీస్ సిబ్బంది క్వార్టర్లు

పొదలతో నిండిన క్వార్టర్ల ఆవరణ

ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఎల్‌సి ఐవి, జిల్లా సహాధ్యక్షుడు ప్రసాదరరావు

చారిత్రక సాక్ష్యాలుగా యుటిఎఫ్ నివేదికలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశాల్లో సమర్పించే నివేదికలు చారిత్రక సాక్ష్యాలు ఉండాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐ.ప్రసాద్ రావు అన్నారు. తాళ్లరేవు నామన వెంకాయమ్మ జెడ్‌పి హైస్కూల్లో ఆదివారం మండల శాఖ కౌన్సిల్ సమావేశం ఎం.తాతారావు అధ్యక్షతన నిర్వహించారు. పోరాటాలు, కార్యక్రమాల నివేదికను మండల ప్రధాన కార్యదర్శి గోపి సత్యనారాయణ చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాల్లో ప్రవేశపెట్టే నివేదికలు భావితరాలకు చైతన్య స్ఫూర్తిగా నిలవాలన్నారు. విద్యారంగం పట్ల పాలకుల విధానాన్ని ప్రతి ఉపాధ్యాయుడూ అర్థం చేసుకోవాలన్నారు. సిపిఎస్‌కు బదులుగా జిపిఎస్ అమలు చేస్తామని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించినా ఉపాధ్యాయ సంఘాలు మౌనం వహించడం మంచిది కాదన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పి ఛైర్మన్ దున్నా జనార్దన రావు, డి.సత్యనారాయణ, వీరేంద్ర, యువి.ప్రణామి, కెఎస్‌ఆర్‌కె.మోహన్, ఎం.బాలకృష్ణ, కౌలు రైతు సంఘం నేత వల్లు రాబాబు పాల్గొన్నారు.

భారీగా పెరిగిన ఉల్లి ధరలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ప్రజల అవసరాలకు సరిపడగా సరఫరా సరిగా లేకపోవడంతో ఉల్లి ధరలు కొద్ది వారాల్లోనే రెట్టింపు అయ్యాయి. మార్కెట్‌లో ఉల్లి ధర మళ్లీ ఆందోళనకర స్థాయికి చేరుకుంది. ఈసారి కేవలం వారం రోజుల్లోనే ఉల్లి ధర రెట్టింపయ్యింది. వర్షాలు ఆలస్యంగా కురవడం వల్ల ఉల్లి పంటలపై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో దిగుబడి తగ్గింది. దీని కారణంగా ఉల్లిపాయల సరఫరా తక్కువగా ఉందని చెబుతున్నారు. వారంరోజుల క్రితం కిలో రూ.40-50కు విక్రయించిన ఉల్లిపాయలను, ఆదివారం మార్కెట్‌లో కిలో రూ.70 పైగా వుంది. జూలైలో టమాట ధర కిలో రూ.200 పలికింది. అయినప్పటికీ, విక్రయాల వాల్యూమ్‌లలో విపరీతమైన తగ్గుదల కారణంగా అవి కొన్ని వారాల తర్వాత తగ్గాయి. ఉల్లి ధరల పెరుగుదలకు అకాల వాతావరణ పరిస్థితులే ప్రధాన కారణమని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా అక్టోబర్‌లో మంచి వర్షాలు కురుస్తాయి, కానీ ఈ సంవత్సరం దాని జాడ కనిపించలేదు అని రైతులు చెప్తున్నారు. నవంబర్ లేదా డిసెంబర్ తర్వాతే ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నట్లు పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో వినియోగదారులు ఉల్లిని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి పట్టుకెళ్తున్నారు. అకస్మాత్తుగా ఉల్లి ధరలు పెరగడంతో గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం ఉల్లి ధరలు తగ్గించేలా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రయోగాల వర్క్‌షాప్‌నకు విశేష స్పందన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలో ఏర్పాటు చేసిన యాక్ట్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన భౌతిక, రసాయన శాస్త్ర వర్క్ షాప్‌నకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ అన్నారు. ఈ వర్క్ షాప్‌కు 100 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. విన్నదానికంటే చదివిన దానికంటే ప్రయోగం ద్వారా తెలుసుకున్నది ఎక్కువ ప్రభావం చూపిస్తుందన్నారు. ఈ వర్క్ షాప్‌నకు రిసోర్స్ పర్సన్‌గా రేవతి సైన్స్ ఫౌండేషన్ రామచంద్రపురం శ్రీకృష్ణ సాయి వ్యవహరించారన్నారు. ప్రయోగాల ద్వారా తెలుసుకోవడం వల్ల బాగా అర్థమయ్యాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడికి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కాకినాడ, ఏలేశ్వరం

కావలిలో ఆర్‌టిసి డ్రైవర్ రామ్ సింగ్‌పై దౌర్జన్యం చేసిన సంఘ విద్రోహ శక్తులను వెంటనే అరెస్టు చేసిన కఠినంగా శిక్షించాలని ఆర్‌టిసి ఉద్యోగుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద డిపో కార్యదర్శి ఆర్.ఇందేష్ ఆధ్వర్యాన ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడులు చేసిన సంఘ విద్రోహ శక్తులు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. ఆన్ డ్యూటీ సిబ్బందికి రక్షణ కల్పించాలని, సిబ్బందిపై దాడి చేస్తే ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి తీసుకొనే చట్టపరమైన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జార్జిబాబు, జిల్లా కార్యదర్శి పి.సత్యానందం మాట్లాడుతూ దాడిని తీవ్రంగా పరిగణించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉదయం 4:30 గంటల సర్వీసు నుంచి కూడా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఏలేశ్వరం డిపో ఆవరణలో కార్మికులు నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో డిపో మెయిన్ గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి యుబిఎం.కుమార్ మాట్లాడుతూ డ్రైవర్ రామ్ సింగ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.త్రిమూర్తులు, బి.నానిబాబు, కెఎస్‌కె.రావు, ఎంఆర్.కృష్ణ, వివిఎస్.చలం పాల్గొన్నారు.

కాకినాడలో నిరసన తెలియజేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరుగుతుందని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికాశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

బాబ్జిని సస్పెండ్ చేయాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-కాకినాడ

వైసిపి జిల్లా ట్రేడ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వైసిపి జిల్లా అధ్యక్షుడు ఎంఎల్ఎ కురసాల కన్నబాబుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష పార్టీలతో కుమ్మక్కై, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్న బాబ్జిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

బాబ్జీరాజుకు దాట్ల పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సాగి బాబ్జీరాజును మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పరామర్శించారు. పిల్లంక గ్రామానికి చెందిన బాబ్జీ రాజు ఇటీవల హైదరాబాద్‌లో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన సందర్భంగా ఆదివారం సుబ్బరాజు కలిసారు. ఆయన వెంట రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి), మందాల గంగ సూర్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు కాకర్లపూడి రాజేష్, శ్రీకాంత్, మోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల వద్ద జాబితాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

కళ్లకు గంతలు కట్టుకుని టిడిపి నిరసన

చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా టిడిపి ఆధ్వర్యాన ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని పలుచోట్ల నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ మాజీ మేయర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నిజం గెలవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, చల్లా పార్వతి, పాలిక సత్య, నక్కా జ్యోతి, రేలంగి లక్ష్మి, కనకం, దుర్గ, సత్యవతి, నిర్మల, రమణ, భ్రమరాంబ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** టిడిపి నియోజకవర్గం పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు వలసపాకలలో పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్, బోళ్ల కష్ణమోహన్, క్లస్టర్ ఇన్చార్జిలు తాతపూడి రామకష్ణ, సరిదే నాగర్నాథ్ మిరపల ప్రకాష్, మట్టా ప్రకాష్ గౌడ్, కాళ్ళ శ్రీను తదితరు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మఠం సెంటర్‌లో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నిజం గెలవాలని నినాదాలు చేశారు. మండలంలోని హుస్సేన్‌పురం కెనాల్ రోడ్డుపై చల్లా బుజ్జి ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, గుండు వీర్రాజు, బలుసు వాసు, తాతపూడి కృష్ణబాబు, బి.త్రిమూర్తులు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మెహర్ కాంప్లెక్స్ వినాయకుని ఆలయంలో చంద్రబాబు కోసం పూజలు చేశారు. **ప్రత్తిపాడు** రాష్ట్రంలో టిడిపి కార్యకర్తల మనోనిగ్రహం దెబ్బతీయడం ఎవరి వల్లా కాదని టిడిపి రాష్ట్ర నాయకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు అన్నారు. ప్రత్తిపాడులో ఆదివారం నిర్వహించిన టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు టిడిపి కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు అన్నారు. అతి త్వరలోనే చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు శాంతి భద్రతలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బద్ది రామారావు, పర్వత సురేష్, సూతి బూరయ్య, బొద్దిరెడ్డి గోపి, బస ప్రసాద్, పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు.

సామర్లకోట రూరల్‌లో..

కాకినాడ రూరల్‌లో..

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి -కరప

కరప నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లీలా మనోహర్ తెలిపారు. పాఠశాల క్రీడ సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానం కాకినాడలో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఖోఖో అండర్-14 విభాగంలో బి.పావని, జి.బేబి ఐశ్వర్య, జి.రామ్ చరణ్, అండర్-17 విభాగంలో టి.దుర్గాదేవి,, యష్మిత, హర్షవర్ధన్, షూటింగ్ బాల్ అండర్-17 విభాగంలో పి.నరసింహ ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు నవంబర్‌లో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ విద్యార్థులను పీడీ కె.శ్రీనివాసరావు, కృష్ణ, చంద్రశేఖర్‌ను జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, ఎంపిపి శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ తాతీలు, ఎంఇఒ కె.బుల్లికృష్ణవేణి. ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీపాదం రమాదేవి, స్టాఫ్ సెక్రటరీ ఎం.రమేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కార్టూ'నిజం'



చెరిగిపోతున్న చరిత్ర

పుస్తక పఠనంలో బాల మందిరం విద్యార్థులు

పుస్తక పఠనంతో శాస్త్రీయ విజ్ఞానం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

విద్యార్థి దశ నుంచీ ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకోవచ్చుని బాల మందిరం వ్యవస్థాపకులు అంగర గోపాలకృష్ణ పేర్కొన్నారు. మాధవపట్నం గ్రామం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బాలమందిరం విద్యార్థులకు పుస్తక పఠనం, చదివిన పుస్తకాలు సమీక్ష చేశారు. ఇన్‌డోర్ గేమ్స్ చెస్, లూడో, వైకుంఠ పాళీ, ఆడారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై రోహిత్ మాట్లాడుతూ బాలమందిరంలో తాను నేర్చుకున్న విషయాలను వివరించాడు.

పంట నమోదు ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో ఈ ఏడాది సార్వా పంటకు సంబంధించి పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని మండల వ్యవసాయాధికారి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 9,657 మంది రైతులు పండిస్తున్న 19,160 ఎకరాలు నమోదు చేసినట్టు చెప్పారు. ఇందులో 8987 మంది రైతులకు సంబంధించిన 18,525 ఎకరాలు ఇకెవైసి కూడా పూర్తి చేశామన్నారు. దీనికి సంబంధించి రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల వద్ద క్రాప్ సామాజిక తనిఖీ జాబితాలు ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ అభ్యంతరాలను పరిశీలించి తుది ఈ క్రాప్ బుకింగ్ జాబితాలను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

సాగునీటి కొరతను నివారించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వరి, అపరాల పంటల చివరి దశలో క్లిష్ట పరిస్థితులు నెలకొనడం వల్ల రైతులు నీటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ వి.మునిరత్నం అన్నారు. స్థానిక వ్యవసాయ కేంద్రంలో వ్యవసాయ అధికారులు, రైతులతో నిర్వహించిన 'శిక్షణ-సందర్శన' కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో తక్కువ వర్షపాతం నమోదు కావటం వల్ల వరి, అపరాలు పంటల్లో ఈ పరిస్థితి నెలకొందన్నారు. పంట ఉత్పత్తులను రక్షించుకోవాలంటే నీటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరిలో అక్కడక్కడ ఎండాకు తెగులు,సుడిదోమ కనిపిస్తు న్నాయన్నారు. వీటి నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. దాళ్లాలో విత్తనం ఎంపిక ప్రధానమన్నారు. దాళ్లాలో వరి పండించలేని ప్రాంతాలలోని వరి మాగాణుల్లో డిసెంబర్‌లో మినుము, పెసర విత్తనాలు చల్లుకోవాలన్నారు. మినుములో ఎల్‌బిజి 884 రకం విత్తనం పల్లాకు తెగులు తట్టుకుంటుందన్నారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ సిహెచ్.వెంకట నరసింహారావు మాట్లాడుతూ సార్వా చివరి దశలో వేడికి సుడి దోమ ఆశించే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎఎస్‌ఆర్.శర్మ, డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, డాక్టర్ భరత్ చంద్ర, డాక్టర్ వి.సుజాత, డాక్టర్ బివిఎస్‌సి.హరి, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ వై.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ మునిరత్నం

జనసేనలోకి గొరకపూడి చిన్నయ్యదొర

సామర్లకోట రూరల్ : ఉమ్మడి ఎపి కౌన్సిల్ ఛాంబర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొరను జనసేన పార్టీలోకి రావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ కోరారు. ఆదివారం స్థానిక సంపెంగతోటలో చిన్నయ్యదొర నివాసానికి జనసేన నాయకులతో కలిసి దుర్గేష్ వచ్చారు. ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ చిన్నయ్యదొర సేవా కార్యక్రమాల్లో ముందు ఉండటమే కాకుండా రాజకీయాలలో తనకంటూ మంచి ఒరవడి సష్టించుకుని మంచి గుర్తింపు పొందారని అన్నారు. చిన్నయ్యదొర ను జనసేన పార్టీ లోకి రావాల్సిందిగా ఆహ్వానించామని, ఆయన త్వరలో జనసేన పార్టీలో చేరతారని తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

200 మందికి నేత్ర వైద్య సేవలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని లింగంపర్తిలో కురివెళ్ల హర్షధర్మతేజ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు ప్రారంభించారు. హైదరాబాద్ ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ అనుబంధ నిడదవోలు రాజరాజేశ్వరి లయన్స్ వైద్యశాల వైద్య బృందం సేవలు అందించారు. ఈ శిబిరంలో 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కళ్లజోళ్లు అందజేశారు. అవసరమైన వారిని ఆపరేషన్ల నిమిత్తం నిడదవోలు తరలించారు. ఈ కార్యక్రమంలో కురువెళ్ల రాజా, చినబాబు తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

బైకును లారీ ఢీకొని హిళ మృతి

ప్రజాశక్తి-దేవరపల్లి

బైకును లారీ ఢీకొని ఒక మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం దేవరపల్లి-గోపాలపురం హైవేలో చోటు చేసకుంది. బైకుపై వెళుతున్న భార్యా భర్తలను గొల్లగూడెం గ్రామం వికలాంగుల ఆశ్రమం సమీపంలో ఒక లారీ వెనుక నుంచి ఢీకొట్టగా ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో దిర్శిపాము నాగవేణి (45) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త యేసయ్య గాయపడగా గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు

వ్యాన్ ఢీకొని కార్మికుడు మరణం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వ్యాను ఢీకొని కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వలసపాకల గ్రామంలో ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పరిశ్రమ క్యాంటీన్‌లో పి.దుర్గ (28) దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తం తెల్లవారుజామున 5 గంటల 45 నిముషాల బయలుదేరిన దుర్గ వలసపాకల బ్రాందీ షాప్ సెంటర్‌కు చేరుకొనేసరికి పోర్టుకు ఐస్ లోడుతో వెళుతున్న వ్యాన్ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు తగలడంతో దుర్గ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి

కార్మికుని కుటుంబాన్ని కంపెనీ, ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. డ్యూటీ టైంలో గంట ముందు డ్యూటీ దిగిన తరువాత గంటలోపు కార్మికునికి ఏమి జరిగినా కంపెనీ బాధ్యత వహించాలన్నారు. కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

కె.పద్మశ్రీవల్లి

సిహెచ్.కృష్ణ

రాష్ట్ర స్థాయి గేమ్స్‌కు 'ప్రతిభ' విద్యార్థులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

తమ విద్యార్థులు విద్యలోనే కాక ఆటల్లో కూడా సత్తా చాటారని సామర్లకోట ప్రతిభ విద్యా నికేతన్ హైస్కూల్ డైరెక్టర్ ఎస్‌వివిజి.ప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం కాకినాడలో నిర్వహించిన అండర్ 17 ఖోఖో స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు సిహెచ్.కృష్ణ (9వ తరగతి), కె.పద్మ శ్రీవల్లి (8వ తరగతి) విజయం సాధించి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల ద్వారా శారీరక, మానసిక వికాసం, అభివృద్ధి జరిగి పిల్లలలో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విజయం సాధించిన విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపల్ టి సునీత. వైస్ ప్రిన్సిపల్ పి.గౌరి విద్యార్థులను అభినందించారు.

ఆట వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి-నల్లజర్ల

యువత చెడు వ్యసనాలకు జోలికి పోకుండా విద్యలోనూ క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని వైసిపి నాయకులు మద్దిపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో క్రీడలను ప్రోత్సహిస్తూ యువతకు వాలీబాల్, నెట్, వంటి ఆట వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

200 మందికి కంటి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం దూబచర్ల శ్రీ సంఘమిత్ర విద్యాలయలో లయన్స్ క్లబ్, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని చేపట్టామని క్యాంప్ ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో 20 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం వేమగిరి కంటి ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, దూబచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.రత్నం, కూచిపూడి ఉదయభాస్కరరావు, ఆచంట సత్యనారాయణ, దూబగుంట్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సతీష్ బాబు మాస్టారును సన్మానిస్తున్న ఎంఎల్‌సి కుంభ రవిబాబు

సతీష్‌బాబుకు భీమ్ వీర్ పురస్కారం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కన్నూరి సతీష్‌బాబుకు ఆలిండియా షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమ్ వీర్ పురస్కారం అందించింది. సతీష్‌బాబు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా అందించిన సేవలకు గాను దీన్ని అందించారు. ఎంఎల్‌సి కుంభ రవిబాబు చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఏలూరు జిల్లా ఏలూరులో ఆల్ ఇండియా షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ పురస్కారాన్ని అందించారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీత సతీష్‌బాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ప్రజాశక్తితో డిఇఒ కమల కుమారి

ప్రజాశక్తి-అమలాపురం

నాడు-నేడు పనులతో అనేక స్కూళ్లలో రూపురేఖలు మారిపోతున్నాయి. సమస్యలు సమసి సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. విద్యా కానుక పంపిణీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో రోజురోజుకూ భరోసా పెరుగుతుంది. ఫీజుల భారం భరించలేక జిల్లావ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సర్కారు బడుల్లో చేరుతున్నారు.అమ్మఒడి వంటి మహత్తర పథకాలు పేద పిల్లలకు మంచి అవకాశం అని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి అన్నారు. పలు అంశాలను ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

రెండో విడత నాడు-నేడు పనులు ఎంతవరకు వచ్చాయి.

జిల్లాలో రెండో దశలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులతో సమూల మార్పులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడానికి నాడు-నేడు ఎంతగానో తోడ్పడుతోంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నాం. రెండో విడతలో జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో పనులు చేయాలని ప్రాతిపాదించి మొదలు పెట్టారు.పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఏయే వసతులు కల్పిస్తున్నారు.

పిల్లలకు అవసరమైన వసతులన్నీ సమకూరుస్తున్నాం. మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, ఆట వస్తువులు, సైకిల్ షెడ్లు, తాగునీరు, బెంచీలు, గ్రీన్ బోర్డులు, ఫ్లోరింగ్ టైల్స్, మొక్కలు, ప్రతి పాఠశాలకు స్మార్ట్ టీవీ సమకూరుస్తున్నారు. భవిష్యత్తులో పిల్లలు బాధ్యతగా మెలిగేందుకు పాఠశాల విద్యా కమిటీల్లో వారిని భాగస్వామ్యం చేసేలా చేస్తున్నారు. ఉపాధ్యాయుల కమిటీలను కూడా త్వరలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

విలీనంపై పలు చోట్ల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు.

విలీనంపై ఎక్కడైనా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్న ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఒక కిలో మీటరు లోపులో ఉన్న ప్రాథమిక పాఠశాలలను మాత్రమే విలీనం చేస్తున్నాం. హైస్కూళ్లలో సౌకర్యాల మెరుగు కోసం కృషి చేస్తున్నాం.

విద్యా కానుక కిట్లులో ఏమి అంస్తున్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లలో మూడు జతల యూనిఫామ్స్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్ వంటివి ఉంటాయి. అలాగే బాలురకు స్కై బ్లూ రంగు, బాలికలకు నేవీ బ్లూ రంగు బ్యాగులు అందించాము.

పాఠశాలల్లో పర్యవేక్షణ ఎలా ఉంది.

అధికారులు విధిగా పాఠశాలలకు వెళ్లి పర్యవేక్షించాల్సిందే. అక్కడ లోటుపాట్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి. జాబ్ చార్టు ప్రకారం పాఠశాలలు తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఇప్పటికే జిల్లా, ఉప, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు తప్పక పర్యవేక్షించాలని ఆదేశించాం. నిర్లక్ష్యం చేసిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటాం.

నో స్కూల్ బ్యాగ్ డే ఎలా అమలవుతోంది.

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వారంలో ఒక రోజు అయినా చిన్నారులకు పుస్తకాలు మోసే బరువును తగ్గించాలని ప్రభుత్వం భావించింది. అందుకే నో స్కూల్ బ్యాగ్ డే విధానంలో భాగంగా నెలలో మొదటి, మూడు శనివారాల్లో స్కూల్‌కు చిన్నారులు బ్యాగ్ లేకుండా వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించి అన్ని విద్యాసంస్థలకు ఆదేశాలను కూడా జారీ చేసింది.

ప్రభుత్వాన్ని గద్దె దించడమే టిడిపి, జనసేన లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా టిడిపి జనసేన ఉమ్మడి కార్యాచరణతో పని చేస్తామని టిడిపి, జనసేనఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమావేశంలో ఉభయ పార్టీల నాయకులు స్పష్టం చేశారు. టిడిపి జిల్లా సమన్వయకర్త కొల్లు రవీంద్ర, జనసేన పార్టీ జిల్లా సమన్వయకర్త రవిశంకర్ అధ్యక్షతన ఆదివారం కాకినాడలో సమావేశం నిర్వహించారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును సమావేశం తీవ్రంగా ఖండించింది. అనంతరం ఉభయ పార్టీల సమన్వయ కమిటీ నాయకులు మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనపై ఉమ్మడి పోరాటమే అంతిమ లక్ష్యంగా జనసేన టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి పోరాటం చేస్తామన్నారు. తమ నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. వైసిపి అరాచక పాలనతో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు అభివృద్ధి అనేది రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. వైసిపి మంత్రుల దగ్గర నుంచి నాయకుల వరకు అందరూ ఇసుక, మట్టి, మద్యంతో రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. టిడిపి జనసేన కలయికపై ఎన్ని కుతంత్రాలు పన్నినా జాగ్రత్త వహించాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టిడిపి, జనసేన సమన్వయంతో పని చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, కెఎస్.జవహర్, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, రాష్ట్ర పరిశీలకులు శివశంకర్, పిఎసి సభ్యులు ముత్తా శశిధర్, పితాని బాలకృష్ణ, పంతం నానాజీ, శెట్టిబత్తుల రాజబాబు, టిడిపి జోన్-2 సమన్వయకర్త మందలపు రవికుమార్, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ఎన్.వర్మ, అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు, పిల్లి అనంతలక్ష్మి, చిల్లా జగదీశ్వరి, చెల్లి వివేకానంద, మాజీ ఎంఎల్‌సి రెడ్డి సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉభయ పార్టీల నాయకులు

దాడిపై ఆర్‌టిసి డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఉదయం 6.30 గంటలకు కొవ్వూరు ఆర్‌టిసి డిపో వద్ద ఆర్‌టిసి డ్రైవర్లు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ నెల 26న కావలిలో ఆర్‌టిసి డ్రైవర్ రాజాసింగ్‌పై దుండగులు చేసిన దాడిని ఖండించి నిరసన తెలిపారు. రాజాసింగ్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎంవి.రావు, రీజినల్ అధ్యక్షులు టివి.రాజు పాల్గొన్నారు.

పేదలకు 'మల్లిపూడి' సాయం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మల్లిపూడి ట్రస్ట్ తరుపున పేదలకు ప్రతి నెలా కిరాణా, బియ్యం, పెన్షన్, న్యాయ సాయం, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందిస్తామని ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు తెలిపారు. ఆదివారం ధర్మవరంలో గ్రామపెద్ద ముళ్ళపూడి కాశి, జాలాది రవికుమార్ చేతుల మీదుగా ఎనిమిది పేద కుటుంబాలకు రూ.7,500 నగదు వైద్యా ఖర్చుల నిమిత్త అందించారు. ఈ కార్యక్రమంలో తానేటి రమేష్, దసిక దాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడలో భారీ అగ్నిప్రమాదం

రూ.లక్షల విలువైన వలలు, 3 బైకులు దగ్ధం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామం నాయకర్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.లక్షల విలువైన వలలు, మూడు బైకులు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం ఉప్పాడ గ్రామానికి చెందిన మైలిపల్లి అప్పారావు రేకుల షెడ్డులో కొందరు మత్స్యకారులు చేపలు వలలు స్టోర్ చేస్తుంటారు. అదే ప్రదేశంలో కొందరు బైకులు కూడా అక్కడే నిలుపుదల చేస్తూ ఉంటారు. ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగి రేకుల షెడ్డులో ఉన్న వలలు, మూడు బైకులు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు రావడంతో గమనించిన స్థానిక మత్స్యకారులు పిఠాపురం అగ్నిమాపక సిబ్బందికి, స్థానిక సర్పంచ్‌కు సమాచారం అందచేయడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే బైకులు, వలలు మంటల్లో కాలి బూడిద అయ్యాయి. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ మరి ఏదైనా కారణమా వల్ల జరిగిందా అనే కోణాల్లో అగ్నిమాపకసిబ్బంది దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు గారూ.14లక్షల పైబడినష్టం వాటిల్లినట్లు స్థానిక మత్స్యకారులు తెలుపుతున్నారు

కాలి బూడిదైన వలలు, ద్విచక్ర వాహనాలు

బాధితులకు ఎంఎల్ఎ దొరబాబు పరామర్శ

అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. వలలు, బైకులు అగ్నికి ఆహుతి అవడంతో మత్స్యకార మహిళలు కంటతడి పెట్టుకోవడంతో స్పందిం చిన ఎంఎల్ఎ ప్రభుత్వంద్వారా రావాల్సిన సహకారంఅందిస్తామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు.

బాధితులకు 'జనసేన' ఆర్థిక సాయం

పలివెల 'జనసేన' కార్యకర్తకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వేర్వేరుచోట్ల జరిగిన ప్రమాద ఘటనల్లో గాయపడిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీతరపున ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. వివరాలు ఇవి..

కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త గంట్రోతు మనోహర్ ఇటీవలే ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందాడు. అయితే వైద్యం నిమిత్తం అయిన ఖర్చును పవన్ కళ్యాణ్ తరపున పార్టీ మెడికల్ ఇన్సూరెన్స్ నుండి రూ.50వేల చెక్కును జనసేనపార్టీ నియోజకవర్గం ఇంఛార్జ్ బండారు శ్రీనివాస్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి బొక్కా ఆదినారాయణ, మండల అధ్యక్షులు కంఠంశెట్టి సత్యప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎస్ఎన్.మూర్తి, తుల రాజు, సప్తగిరి, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి, బాణాపురం గ్రామాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు కాళ్ళ వీరబాబు, దేవు వీరబాబులు ప్రమాదంలో గాయపడి ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందారు. వీరికి రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పంపిన రూ.50వేల చెక్కులను పంపారు. రాయపురెడ్డి బాబి, నరాలశెట్టి రాంబాబు, లంకెలపల్లి జమ్మి,దేవు రాంబాబు, మల్లిపూడి రాజా, సలాది రాజా సమక్షంలో జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గం ఇంచార్జ్ పితాని బాలకష్ణ బాధితులకు అందజేశారని మండల పార్టీ అధ్యక్షులు మద్దింశెట్టి పురుషోత్తం ఆదివారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో పితాని రామ కష్ణ, రాజు, సవరపు వెంకట్, అప్పాడి బాబ్జి, కొర్లపాటి సాయికిరణ్, వాసంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

టి.కొత్తపల్లిలో బాధితులకు చెక్కులు అందిస్తున్న దృశ్యం

చంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చంటి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కిత్తన చెరువుకు చెందిన వైసిపి నాయకుడు బళ్ల చంటి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. చంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో సామాజికవేత్త పచ్చిమాల బాబ్జి, వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, సచివాలయాల మండల కన్వీనర్ కోటుం లోవరాజు, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు ఓగూరి విజయకుమార్, సొసైటీ ఛైర్మన్ ఊటాల రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా చేతిపంపు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ భవనం వద్ద ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురై సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు నేటికీ పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో వేరువేరుగా మరుగుదొడ్లు నిర్మించి చేతిపంపు వద్ద ఉన్న మోటారును వాటర్ ట్యాంక్ వినియోగించి , కుళాయి సౌకర్యం కల్పించడంతో ఈ చేతి పంపును పట్టించుకోలేని నాధుడే కరువయ్యారు. విద్యాశాఖ కార్యాలయంలో సమావేశాలు, నిర్వహించేటప్పుడు, సామూహిక భోజనం కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు, తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడే సందర్భాలు ఏర్పడుతున్నాయి. మరుగుదొడ్డిలో ఉన్న కుళాయిలను వినియోగించడానికి ఇష్టపడని వారు ఈ చేతి పంపునే వినియోగించేవారు. ఈ చేతి పంపు కూడా పనిచేయకపోవడంతో తాగడానికి నీళ్లు లేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులకు గురైన చేతి పంపును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు గురై వినియోగంలో లేని చేతి పంపు

యానాం వార్తలు

ఉపకార వేతనానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ప్రజాశక్తి- యానాం

యానాం ప్రాంతానికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరంలో ఉపకార వేతనం కోసం నేషనల్ స్కాలర్షిప్ పోర్టల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని ఆది ద్రావిడశాఖ ఎడి రేకాడి కృష్ణమూర్తి తెలిపారు. ఉపకార వేతనం ఖాతాల్లోకి బదలాయింపు కోసం నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇకెవైసిలతో ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలని తెలిపారు. నవంబరు 30లోగా దరఖాస్తులు పంపించాలని తెలిపారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడులోని జెడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎపిటిఎఫ్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా ఎన్.ఫిలిప్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.చంద్రశేఖర్, జి.దుర్గాప్రసాద్, డి.ఎ.రాజశేఖర్, కార్యదర్శులుగా బి.సురేష్, బి.సత్యప్రసాద్, కెఎస్.సుబ్రహ్మణ్యం, శ్రీరాం, లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు చేస్తామని మాట ఇచ్చి జిపిఎస్ తీసుకురావడం సరికాదన్నారు. తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను కునారిల్లింపజేస్తున్న జిఒ 117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన డిఎ ఎరియర్స్, డిఎలు తక్షణమే విడుదల చేయాలన్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ, ఎర్న్‌డ్ బకాయిలు విడుదల చేయాలని, విభిన్న మేనేజ్మెంట్ల సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

10 వేల మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు 20 వరకూ నిర్వహించి సుమారు 10 వేల మంది ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.ప్రశాంత్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శనివారంతో మండల పరిధిలో 20 సురక్ష శిబిరాలు నిర్వహించి సుమారు 23 మందిని అత్యవసర వైద్యం కోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి రిఫర్ చేసామన్నారు. వీరిలో అధికంగా గుండె సంబందిత సమస్యలున్నట్లు చెప్పారు. రూ.10 లక్షల వరకూ ఆరోగ్య కిట్లు, మందులు ప్రజలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. స్త్రీలు గైనకాలజిస్టు సేవలను శిబిరాల్లో సద్వినియోగం చేసుకున్నట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ హిమవతి, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ భవ్యశ్రీ, వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలందించినట్లు వివరించారు.

శిథిలావస్థకు రక్షిత నీటి పథకాలు

పొంచి ఉన్న ప్రమాదం, పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం లోని పలు గ్రామాల్లో గతంలో నిర్మించిన రక్షిత నీటి పథకాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్నాయి. కోరుమిల్లి, కపిలేశ్వరపురం, వాకతిప్ప గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి .వాకతిప్ప గ్రామంలో ఉన్న ట్యాంకు మాత్రమే తాగునీరు వినియోగిస్తున్నారు. కేవలం 30 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఈ వాటర్ ట్యాంక్ నాటి కాలపు నిర్మాణ శైలిలో నలుపలకలగా ఉన్నాయి. ఈ వాటర్ ట్యాంక్ లీకేజ్ సమస్య ఉన్నా, సామర్థ్య సరిపోకపోయినా తప్పని పరిస్థితుల్లో తాగునీటి కోసం వినియోగిస్తున్నారు. ప్రతినిత్యం రెండు మూడు దఫాలుగా నీటి సరఫరా చేయడానికి పంచాయతీ ఉద్యోగులు శ్రమిస్తున్నారు. కపిలేశ్వరపురం లో పంచాయితీ వెనుక భాగంలో వినియోగంలో ఉన్న భారీ నీటి ట్యాంకు సమీపంలో నిరుపయోగంగా పాతకాలపు వాటర్ ట్యాంక్ కొబ్బరి చెట్టు అంతఎత్తులో ప్రమాదకరంగా ఉంది .ఏ సమయంలోనైనా ప్రమాదం జరిగితే పక్కన వినియోగంలో ఉన్న నీటి ట్యాంకు పై పడే ప్రమాదం ఉంటుందని, స్థానికంగా ఇళ్లు ఉన్నాయని, పలువురు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు .కోరుమిల్లి ప్రధాన కూడలి లో వినియోగంలో లేని వాటర్ ట్యాంక్ శిథిలమై శ్లాబ్ కుంగి కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రతినిత్యం జనం తిరిగే ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆ ప్రాంత స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ ట్యాంకులను తొలగించడానికి అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి నిరుపయోగంగా ఉండి కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ వాటర్ ట్యాంక్ లను తొలగించే నిర్ణయం తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కోరుమిల్లిలో వినియోగంలో లేని వాటర్ ట్యాంక్

అపరిశుభ్రంగా 'గాంధీనగర్'

పేరుకుపోతున్న చెత్తతో ఇక్కట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని తోటపేట పంచాయతీ పరిధిలో గల గాంధీనగర్లో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. ఎక్కడ డంపింగ్ యార్డ్ లేకపోవడంతో చెత్తాచెదారం మిగిలిపోయిన ఆహార పదార్థాలు, వ్యర్థాలు రోడ్డు పక్కన వేయడంతో తీవ్ర దుర్వాసన ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఎక్కడ చెత్తాచెదారం పేరుకు పోవడంతో దోమలు ఈగలు పెరిగిపోయి పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వం స్వచ్ఛత మన బాధ్యత అంటూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని చెత్తాచెదారాన్ని దూర ప్రాంతాలకు తరలించాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదని పలువురు చెబుతున్నారు. తోటపేట పంచాయతీలోని దళితవాడను ఆనుకునే ఉన్న ఈ చెత్తాచెదాలన్ని తొలగించాలని చర్యలు చేపట్టాలని, దుర్వాసన వెద జల్లకుండా బ్లీచింగ్ జల్లించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

గాంధీ నగర్‌లో పేరుకుపోయిన చెత్త చెదారం

CHANGE OF NAME

I, KOTLA VAMSI KRISHNA, S/o. Veera Raghavulu Kotla, Resident of D.No.12-9-19, Kotla Vari Street, Kovvur (Village & Mandal), East Godavari-534350. I was mentioned My Father Name as **VEERARANGHAVULU KOTLA (Old Name)** instead name as **VEERARAGHAVULU KOTLA (New Name).** So by this notice we are informing all the general public.